# పరాంకుశం!

పెళ్ళిచేసుకుంటానని. దానికామె—

"వద్దుబాబూ! మా లాంటోళ్ళం మీకు తగం" అంది.

పరాంకుశం ఎన్నోవిధాల నచ్చజెప్పి చూసాడు. కానీ ఫలితం శూన్యం.

ఆ బీదింటి పిల్ల భయపడ్డది. పెళ్ళి చేసుకున్న తరువాత కట్నం తేలేదని హింసిస్తాడనీ, బీదింటి పిల్లవని హేళన చేస్తాడనీ, అందుకే పరాంకుశాన్ని తిరస్కరించింది.

* * *

"ఎంత?" అడిగాడు పరాంకుశం ఆయన్ని.

"తొంభై వేలు" చెప్పాడాయన.

"లక్షా, యాభై వేలిస్తేకానీ, మీ పిల్లని పెళ్ళి చేసుకోను" చెప్పాడు పరాంకుశం.

"సరే" ఒప్పుకున్నాడాయన.

* * *

రంగరంగ వైభోగంగా, లాంఛనాలతో లక్షణంగా జరిగిపోయింది... పరాంకుశం పెళ్ళి!! లక్షాయాభై వేలు 'కట్నం' క్రింద తీసుకున్నాడు పరాంకుశం.

శోభనం గదిలో మంటని చూసి ఉలిక్కిపడ్డది అమ్మాజీ! ఆ మంటలో కాలుతున్న వస్తువు— 'కట్నం' పేరుతో తీసుకున్న కేష్‌బాక్స్.

ఆ మంటవైపు చూస్తున్న పరాంకుశం కళ్ళలో కోపం, ద్వేషం, కసి, కనబడుతున్నాయి! ఆ చూపులు—

"ఓ సమాజమా! నువ్వు కుళ్ళిపోయావు. నీనిండా కుళ్ళే. ఒకమంచిపని చేద్దామంటే- అడుగడుగునా అడ్డంకులే!" అన్నట్టున్నాయి.

మంట ఆరిపోయింతరువాత, ఆనందంగా శ్రీమతి అమ్మాజీపరాంకుశంవైపు అడుగులు వేసాడు పరాంకుశం!

—టి.పి. వరదరాజ్
మిడిల్ స్ట్రీట్
సింహాచలం
విశాఖపట్నం-530 028.

## ఫర్ యువర్ ఇన్‌ఫర్ మేషన్

తెలిస్తే చెప్పుకోండి.

1) ప్రపంచంలోకెల్లా పెద్ద పార్కు ఏది? ఎక్కడుంది?
2) పెద్ద మ్యూజియం?
3) ప్రపంచంలోకెల్లా పొడవైన రైల్వే ప్లాట్‌ఫారం?
4) పెద్ద పిచ్చాసుపత్రి?
5) ప్రపంచంలోకెల్ల పెద్ద చెరసాల?

-జి. విజయలక్ష్మి (నెల్లూరు)

(సమాధానాలు 30వ పేజీలో చూడండి)

## వక్ర దృష్టి

# మినీ కథ

"ఇది విన్నారూ?"

"ఏమిటీ?"

"రంగారావుగారబ్బాయి..."

"ఎవరూ?... అ రింగుల జుత్తు.."

"ఆ... అతనే... ఎవర్నో తెచ్చుకున్నాడట".

"పెళ్ళాం ఉండగనే!"

"ఇది మరీ చోద్యం. ఆ సంగతీ తెలవదూ? ఈ మధ్యనే పోయిందిగా!"

"నిజమే?"

"కాన్పు కష్టమై తల్లీ బిడ్డా..."



"పాపం!"

"అందుకే..."

"తప్పేముందీ? చిన్నవయస్సు. ఆలాగే ఉంటాడూ?"

"ఇంకో విషయం విన్నావూ?"

"చెప్పండే..."

"కరణంగారి అమ్మాయి కూడా..."

"ఎవరూ? సంవత్సరం తిరక్కముందే మొగుడు చని..."

"ఆ... ఆపిల్లే"

"ఏం జరిగిందీ?"

"తనూ అలాగే..."

"లేచి పోయిందీ?"

"చిన్న వయస్సు ఆలాగె ఉంటుందీ?"

"ఎందుకుంటుందీ? అల్లాంటి ముండలు ఉండబట్టే లోకం ఇల్లా తయారైంది. హవ్వ! ఎంత చోద్యం కాకపోతే. మొగుడు చచ్చిన ముండకు ఈ పోకడలేమిటీ? సన్నాసిముండ. దీన్ని లేపుక పోయినోడు వాడెంత సన్నాసి వెధవో?"

"అందరూ అనుకుంటున్నారు..."

"ఏమనీ? ఈసంగతేనా? అనుకోరుమరి"

"అలాగని కాదు."

"మరి..."

"రంగారావుగారబ్బాయి తెచ్చుకుంది ఆ పిల్లనే అని..."

"ఆ...!"

—సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి
కేరాఫ్ సిటిజన్ టైలర్స్
పోరుమామిళ్ళ
బద్వేలు (తాలూకా) కడప జిల్లా.